(గత సంచిక తరువాయి)

“వలుపల దాపల ఎడ్లుగట్టుకొని
ఇల్లాలిని మరి వెంట బెట్టుకొని
నవధాన్యాలను గంప కెత్తుకొని
ఏరువాకా సాగుమురో రన్నో
రైతన్నా...!”

పక్కచేల్లో రైతు గొంతెత్తి పాడుతూ నాగలిదుంతున్నాడు. చేలల్లో అక్కడక్కడ రైతులు ఏరువాకసాగి వ్యవసాయప్పనులు చేస్తునే ఉన్నారు.

వ్యవసాయంలో ఎన్ని కష్టాలున్నా, ఒడిదుడుకులున్నా హాయిగా పాడుకుంటూ వ్యవసాయప్పనులు చేసుకోవడం రైతులకు మామూలే.

రైతు పాడుతున్న పాటను వింటూ నాగలి దున్నాడు మనోజ్.




ఎముకలు కొరికే చలిలో చకినాల పిండి దంచుతూ, విసుర్రవుతులిసురుతూ శ్రమను మరిచి పోవడానికి స్త్రీలు పాడుకునే పాటలు జ్ఞాపకం చేసుకుంటున్నాడు. ఏతం పోస్తూ, మోటగొడుతూ 'రాజిగో రాజన్నా' అంటూ రాగాలు తీసే రైతులపాటలు మనోజ్ చెవుల్లో గింగురుమంటున్నాయి.

అతిథి అభ్యాగతులకు, బిచ్చగాల్లకు, ఇంటికొచ్చిన వాళ్ళకు లేదనకుండా కుండలోగలది పెట్టి అరుసుకునేతన తండ్రి లాంటి రైతులను జ్ఞాపకం చేసుకుంటున్నాడు. కోళ్ళు, గొర్లు, మేకలు, బర్లు పెంచుకుంటూ బతికేవాళ్ళు ఇతర సహస్ర వృత్తుల సమస్త జనాలను మననం చేసుకుంటున్నాడు. మన చరిత్ర పాఠం చెబుతూ తెలుగుమాస్టారు చెప్పినట్టు గృహస్థు అనేవాడు కెలకులనున్న తంగేటి జొన్నలాంటివాడే ననుకుంటున్నాడు.

వ్యవసాయప్పనులు చేయడం తనలాంటి చదువుకుంటున్న వాడికి మోటనిపిస్తున్నా ఆ పనులు చేయడంవల్ల రైతు జీవితాల్లోని ఎన్నో కోణాలను చూసే అవకాశముందనుకుంటున్నాడు మనోజ్.

నాలుగైదు సాల్లనుకున్న కొడుకు ఓ కోంర్త దున్నినా ఇంకా నాగలి విడుస్తాననక పోవడం ఓదెలుకు ఆశ్చర్యమేననిపిస్తున్నది.

“నాగలిడువు బిడ్డ.. నీకు కాల్లు నొస్తలే వా..? దున్నిన కాడికి చాలు బూరెలు తయారుగావచ్చింట్లా— ఇంటికి పోయి తిందాంపా...”

“నాకేం అలసటగలేదు నాన్నా.. నేనింకో కోంర్రదున్నుత.. నువ్వు కూసో.. నాకు నాగలుదున్నుతుంటె మంచిగనిపిస్తుంది...”

నాగలి దున్నుతూనే ఉన్నాడు మనోజ్. వ్యవసాయ కుటుంబాల్లోని కష్టసుఖాలు ఎరిగిన తాను తన చదువును వ్యవసాయ కుటుంబాలకు ఉపయోగపడేలా మలుచుకోవాలనుకుంటున్నాడు.

మరికొద్ది సేపాగి నాగలి విడిచాడు మనోజ్. ఎడ్లను తోలుకొని తండ్రీకొడుకులిద్దరూ ఊళ్లో కెళ్తున్నారు.

తోవలో ఉన్న కాలువలో ఎడ్లు నీళ్లు తాగాయి. ఎడ్లను కట్టేసాడు మనోజ్.

వరిగడ్డివాము నుంచి గడ్డిగుంజి ఎడ్లముందేసాడు..

ఇద్దరు కలిసి ఇంటికెళ్ళారు..

బావి దగ్గరికెళ్ళి వాళ్ళు, చేతులు ముఖం కడుక్కున్నారు..

ఇబ్బందిగాఉన్న ధోతీవిడిచి లుంగీ కట్టుకున్నాడు మనోజ్.. “వీనియవ్వ..? కోళ్ళు పాడుగాను.. ఔలారంత తోడుతున్నయి.. మురుగు వాసనత్తంది.. నల్లు పెంచబొందలకు పోకుంట తోడుతన్నయి..” అని వాటిదగ్గరికెళ్ళి “బో బో..” అని తరమేసాడు ఓదెలు.. నీళ్ళు పోకుండా అడ్డంగా ఉన్న బురదను కాలుతో పక్కకు జరిపాడు.. కాళ్ళు·చేతులు నుళ్ళీ కడుక్కున్నాడు..

“బూరెలు, ఉగాది పులుసయినా యోయ్...” అంటూ వంటగదిలో కెళ్ళాడు ఓదెలు.. తండ్రివెనుకే మనోజ్ వెళ్ళాడు..

రోజూ చేసేపని కాని నాగలిదున్నడం వల్ల మనోజ్‌కు కడుపులో ఆకలిదంచుకుపోతుంది. పొద్దుట్నుంచీ ఏం తినలేదని జ్ఞాపకంరావడం వల్ల ఆ ఆకలి మరింతపెరిగింది...

ఆ కుటుంబంలో ప్రొద్దున టిఫినవీ చేయడ మలవాటులేదు.. మూడు పూటలా అన్నమే తింటారు.. పండుగ దినాల్లో మాత్రం ఆయా పండుగలకు చేసుకునే టిఫిన్లుచేసుకుంటారు..

తండ్రిప్రక్కన పీటేసుకొని కూర్చున్నాడు మనోజ్.. ఇద్దరి ముందు పల్లాలుంచింది నర్సమ్మ..

ఉడకబెట్టిన శనగపప్పు, బెల్లంతో చేసిన బూరెలు కంచాల్లో చెరో నాలుగేసింది..

నెయ్యి పాలు తెచ్చివాళ్ళముందుంచింది..

చింతపండు, బెల్లం, వేపపువ్వు, మామిడి ముక్కలు, కొబ్బరిముక్కలతో... చేసిన షడ్రుచుల ఉగాది పులుసు గిన్నెను వాళ్ళముందుంచింది..

“దేవునికి మొక్కినవు గద..” అన్నాడు ఓదెలు.. “బూరెలు పెట్టి మొక్కిన.. మీరు తినుండ్రి..” అందినర్సమ్మ.. “నెయ్యెక్కడిదే.. కొనుక్కొచ్చినవా..?” అన్నాడు ఓదెలు..

పాలుకాగవెడితే పాత్రకు అంటుకునే పాల గోకనీ తినడం మనోజ్ కెంతో ఇష్టం.. చిన్నతనంలో బర్రెను గడ్డికొసుకొచ్చేవాడు.. ఇంట్లో పాడిలేని సమయంలో ఇంత తవుడు తీసుకెళి

## నిదానమే ప్రధానం



దాసరి తనయుడు అరుణ్‌కుమార్ అంగీకరించిన 'పెళ్ళిలో చూసిన ఆ అమ్మాయే కావాలి' చిత్రం ప్రారంభం కావలసి ఉన్నప్పటికీ, అనివార్య కారణాల వల్ల జాప్యాన్ని ఎదుర్కొంటోంది. అయితే ఈ చిత్రాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని దాసరి అంటున్నారు. భారీ వ్యయంతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటుందని ఆయన చెప్పారు. అరుణ్ కుమార్‌కు 'అంతఃపురం' చిత్రం తరువాత కొద్ది కాలం గ్యాప్ వచ్చిన సంగతి విదితిమే.

తేనో, ఉచితంగానో పెరుగుపోసే వారు.. తానే ఎన్నోసార్లు తెచ్చాడలా.. ఇప్పటికీ పోస్తున్నారు కొందరు.. "మనకు బర్రుంది గదా నాన్న..." అన్నాడు మనోజ్.

"మన బర్రె పాలల్ల వెళ్ళిన నెయ్యే..." అంది నర్సమ్మ...

బూరెల మీద నెయ్యేసుకొని తండ్రికొడుకులిద్దరు తింటున్నారు.. మధ్య మధ్య ఉగాదిపులుసు తాగుతున్నారు..

రెండు తరాలకు చెందిన వాళ్ళిద్దరూ ఆప్యాయంగా మాట్లాడుకుంటూ ఉగాది పండుగ ప్రత్యేక వంటకాన్ని తింటున్నారు..

చింతచెట్టుమీది నుంచి కోకిల కుహూ కుహూ రాగాలు వినబడ్తున్నా యప్పుడప్పుడు..

'చిలుకా గోరెంకా... పలికే పకా పకా..

నువ్వే చిలుకలైతే.. నేనేగోరెంకా...,

బజారువెంట పాట పాడుకుంటూ పోతున్నాడు పాటల రామయ్య...

వాకిట్లో నిల్చొని బుడిగె జంగం తన బుడిగె వాయిస్తున్నాడు.. పాట పాడుతున్నాడు..

"పండుగ లేదు పబ్బం లేదు.. యాల్లలేదు పొల్లలేదీల్లకు.. అంబటాల్లయిందో కాలేదో ఉరికచ్చిండ్రు..."

విసుక్కుంటూ వడ్లు తీసుకెళ్ళి అతని జోలెలోపోసింది నర్సమ్మ.. "పండుగ దినమని వచ్చినం తల్లీ... బూరెలెయ్యవ్వా.. ధర్మం గల చెయ్యి తల్లీమీది.. కాపుదనపిల్లు మీది.. బుక్కెడంత బువ్వేయ్యండ్రి.."

"గింత పొద్దుగాల్నే బువ్వాకూర బూరెలండి పెట్టిన మనుకుంటున్నవా...? అంబటాల్లన్న కాలేదింక... దేవునికే మొక్కకపోతిమింక.. బూరె లెయ్యిమననడ్తివి.."విసుక్కుంటూ అంది నర్సమ్మ...

"అవద్దమాడినా అతికినట్టుండాలె తల్లి.. నీకవద్ద మాడుదు సాతగాదు తల్లి.. తండ్రీకొడుకులు బూరెలు తింటండ్రుగద బాంబెను.."

"చూసినవా...?"

అని ఓ బూరె తీసుకెళ్ళి ఆ బిచ్చగాడికేసింది నర్సమ్మ...

ఖాళీ అయిన తండ్రీకొడుకుల గిన్నెల్లో చెరోరెండు బూరెలేసింది.. "ఇంకెందుకే అవ్వ... నాలుగుతిన్నం చాలయా..? అన్నాడు మనోజ్..

"సంవత్సరాదినాడు మంచిగ తినాలె బిడ్డ.." గీవయసుల ఎన్ని తిన్నా అరుగుతయి.." అని ఇద్దరికీ చెరోబూరె వేయబోయింది నర్సమ్మ... "ఇకచాలు.. ఇదేమన్నకడుపనుకుంటన్నవా..? కాగా..? పెద్దపెద్దబూరెలు ఆరుతిన్నంక గూడ ఇంకా తినుమంటన్నవా..? ఇప్పుడద్దు.. ఆకలయితె అటెనుక తింటం..." ఓదెలనగానే ఆగిపోయింది నర్సమ్మ... "నాకు చిన్నగ చేసుడు సాతగాదు.. ఆకులోలె పల్చగ జేత్తె అండ్ల పప్పేం పడుతది.. తింటె కడుపునిండ తినాలె..."

వాళ్ళిద్దరూ బూరెలు తినడం పూర్తిచేసి కంచంలోనే చేతులు కడుక్కొని లేచి బయటకొచ్చారు...

"నీ సోపతికాల్లతోని కొంచెం సేపు తిరిగిరాపో బిడ్డ.. ఇంట్ల కూసుంటె నిద్రత్తది... పగటి వారకన్నం కూర తిందాం.. నేంగూడ పొలం దిక్కు పొయ్యత్త..."

చెప్పులు తొడుక్కొని పొలందిక్కుబయలు దేరాడు ఓదెలు...

మనోజ్ మిత్రులను కలుసుకొని మధ్యాహ్నం వరకు గడిపాడు..

తండ్రికొడుకు లిద్దరూ కలిసి మధ్యాహ్నం భోజనం చేసారు.. సాయంత్రం హనుమాండ్ల గుడిముందుపంచాంగం వినిపిస్తున్నాడు రమణయ్యగారు.

రైతులంతా తమ జన్మనామాలు చెప్పి గ్రహచార మడుగుతున్నారు.రాశుల వారీగా ఆదాయ వ్యయాలు చెబుతున్నాడు అయ్యవారు..

ఓదెలును ఆదాయం ఏడుపాల్లయితే వ్యయం పదిపాల్లని, మనోజ్‌కు ఆదాయం పన్నెండుపాల్లయితే ఖర్చుఅయిదుపాళ్ళని చెప్పాడు.

"నాపేరు మీద ఈ సంవత్సరం లోపలికే ఉంది.. నా కొడుక్కు ఖర్చుకంటె ఆదాయమెంతో ఉంది.. అందుకే నా కొడుకు పేరు మీద సాగువాటు జేయించిన..."

తోటిరైతులతో మాట్లాడుకుంటూ ఇంటికెళ్ళాడు ఓదెలు.. సాయంత్రమవుతుంది.. పశువులు ఊళ్ళో కొస్తున్నాయి..

తన మిత్రుల్ని తీసుకొని చెరువు దిక్కెళ్ళాడు మనోజ్. చెరువుకట్టమీద కూర్చొని చెర్లోకి చూస్తున్నారు.

పొద్దు గూట్లో పడబోతుంది.. చెరువుకట్టకున్నతాళ్ళ కల్లును విడుచుకొని గౌండ్లుఇండ్ల కెళ్తున్నారు.. శ్రామిక స్త్రీలు పనిముగించుకొని ఊరిదిక్కునడుస్తున్నారు..

పడమటిదిక్కున్న రెండు గుట్టలసందుల్లోంచి గుంకడానికి సిద్ధంగా ఉన్న సూర్యుడు ఎరుపురంగులో ఉన్నాడు.

మిత్రులతో మాట్లాడుతూ చెర్లోకి గులకరాల్లేస్తున్నాడు మనోజ్.. చల్లటి గాలివీస్తుంది.. ఆకాశంలో పక్షులు వలయాలుగా తిరుగుతున్నాయి. చెరువు కట్ట కిందున్న తామర కొలనులో కొంగలు వాలుతున్నాయి. పొలాల గంట్ల వెంట మరెన్నో కొంగలు వాలున్నాయి..

చెర్లో జిలుకులు ఈదులాడుతున్నాయి.. చెరువు మధ్య నున్న గుట్టబోరుమీద పక్షుల బారులు తీరున్నాయి..

చెర్లో చేపలు పై కెగురుతున్నాయి.. వాట్ని వేటాడటానికి నీటి ఉపరితలంపై కొన్ని పక్షులెగురుతున్నాయి..

చెరువు కట్టకున్న చెట్లపైనుండి కోకిలమ్మ



కుహూ కుహూరాగాలు వినబడ్తున్నాయి..

ఆ వాతావరణమెంతో ఆహ్లాదకరంగా ఉంది.. ప్రకృతి ఒడిలో సేదతీరుతున్నట్టనిపిస్తుంది మనోజ్‌కు.. "అదుగో బుడుబుంగ పక్షులెట్ల తమాష చేస్తున్నయో చూడు.. ఇక్కడ మునగడం, అక్కడ తేలడం.."

అన్నాడు మిత్రునితో మనోజ్..

"వాటిపని అవి చేస్తున్నయి. జిలుమలనుపట్టుకుంటానికి ప్రయత్నం చేస్తున్నడు బెస్తయినె.."

చీకటయ్యేవరకు మిత్రులతోనే గడిపాడు మనోజ్.. మనోజ్ ఇంటికెళ్ళేసరికి నర్సమ్మ అతని కొరకెదిరి చూస్తూంది.. "రాబిడ్డరా... గింతసేపెటువోయినవు..?" అంది.. "సోపతికాల్లతో నల్ల చెరువు దిక్కు పోయినట్టున్నడు.." అన్నాడు ఓదెలు. ఔనన్నట్టు తలూపాడు మనోజ్.

ఈ పండుగకుమాంసం వండుకోరు.. తండ్రీ కొడుకులు చెరిరెండు బూరెలు తిన్న తర్వాత పప్పుచారుతో, శనిగపప్పు కట్టుతో భోజనం పెట్టింది నర్సమ్మ...

తనవాళ్ళతో, మిత్రులతో, తన ఊరివాళ్ళతో ఎంతో ఆనందంగా గడిపాడా రోజు మనోజ్...

'పండుగ కింటికి రాకుంటే నేనెన్నో కోల్పోయేవాడిని...'తనలోతాననుకుంటూ నిద్రలోకొరిగాడు మనోజ్...

★★★★★★

మూడు దశాబ్దాలు కాలగర్భంలో కలిసిపోయాయి. ఓదెలిప్పుడు పూర్తిగా వృద్ధుడయ్యాడు. మనోజ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా, వ్యవసాయాధికారిగా ఇరవై ఐదేళ్ళుగా పనిచేస్తున్నాడు... ఆతడిప్పుడు ఐదు పదులవయసుకు దగ్గర్లో ఉన్నాడు.. మనోజ్ కొడుకు ఐ.ఐ.టి.లో ఇంజనీరింగ్ చేసి బెంగుళూరులో పనిచేస్తున్నాడు.. గతసంవత్సరమే కూతురు పెళ్ళికూడాచేసాడు మనోజ్..

ఈ ముప్పైయేళ్ల కాలంలో చాలా మార్పులే వచ్చాయి. అంతకుముందే మొదలైన మార్పులు ఈ కాలంలో మరింత వేగవంతమయ్యాయి. గ్రామాలు పెరిగాయి. రద్దీ పెరిగింది. వ్యాపార పంటల ఉత్పత్తి పెరిగింది. వ్యాపారసంస్కృతీ క్రమక్రమంగా ప్రవేశిస్తున్న ది. రూపాయితనం తన ప్రభావాన్ని చూపెట్టడం మొదలైంది. పరిశ్రమలు పెరిగాయి. పారిశ్రామిక నాగరికతా పెరిగింది. విపరీతంగా రసాయనిక ఎరువులు, పురుగుల మందులు వాడి భూములను నిస్సారం చేయడమూ జరుగుతున్నది. సమాజంలో ఎన్నో మార్పులొచ్చినట్టే అనిపిస్తున్నది.

మూడుపాతికల కాలానికి, మూడుతరాల మార్పులకు సాక్షీభూతంగా ఉన్నట్టున్నాడు ఓదెలు... కాని అభివృద్ధి పేరుమీద జరుగుతున్న మార్పుల్లో ఎక్కడో, ఏదో లోపమున్నట్టే అనిపిస్తుంది ఓదెలుకు. ఉన్నత విద్యావంతుడైన మనోజ్‌కు కూడా అలాగే అనిపిస్తుంది. ఉన్నత విద్యావంతుడై, మంచి ఉద్యోగంలో ఉన్న తన కొడుకు చాలామందిలా తమను మర్చిపోకుండా తన కేలోటు రాకుండా చూసుకోవడం ఓదెలుకు సంతృప్తికరంగానే ఉంది. తనతో ఆత్మీయంగా అన్నీ మనసువిప్పి మాట్లాడే కొడుకంటే గర్వంగానూ ఉంది.

తెల్లవారితే ఉగాది...అరుగుమీద పక్క పక్క మంచాల్లో పడుకొనున్న ఓదెలు, మనోజ్

> ఈ ముప్పైయేళ్ల కాలంలో చాలా మార్పులే వచ్చాయి. అంతకుముందే మొదలైన మార్పులు ఈ కాలంలో మరింత వేగవంతమయ్యాయి. గ్రామాలు పెరిగాయి. రద్దీ పెరిగింది. వ్యాపార పంటల ఉత్పత్తి పెరిగింది. వ్యాపారసంస్కృతీ క్రమక్రమంగా ప్రవేశిస్తున్న ది.

ఎవరి ఆలోచనల్లో వాళ్లున్నారు. తమ కోసం ఈ పండుగకు వరంగల్ నుంచి వచ్చిన కొడుకుతో ఆత్మీయంగా మాట్లాడాలనుంది ఓదెలుకు.

మంచంలో లేచి కూర్చున్నాడు.

"ఏంటి నాన్నా..! బయటికెళ్తవా...? నన్ను తీసుకెళ్లమంటవా...?" అన్నాడు లేచి కూర్చుంటూ మనోజ్.

"ఏంలేదు బిడ్డా...నీతోని మాట్లాడాలనిపించింది..." తండ్రేం మాట్లాడ్తాడో తెలిసిన మనోజ్ ఏం మాట్లాడలేదు.

"ఏంది బిడ్డా! గిట్లయితంది. భూములన్నీ పనికిరాకుండయితన్న యంటున్నరు. నీలాంటి చదువుకున్నోల్లే ఎరువులు బాగ వాడాలంటిరి... మందుల కలువాటుజేత్తిరి..వాట్ని వాడితెనేమో భూములు పాడుగా వట్టె..."

మనోజ్ ఊహించిన ప్రశ్నే వేశాడు ఓదెలు.

"నాన్నా! భూముల్లో విపరీతంగా రసాయనిక ఎరువులు వాడటంవల్ల భూమి కోతకు గురవుతున్నది. అంటే ఈ మందులు భూసారాన్నంతా లాగించివేస్తాయి. భూమిని తినేస్తాయి. మట్టిలో అంతులేని ఖనిజలవణాలున్నాయి నిజమే...కాని మనం దున్నగలిగేంత లోతు వరకు భూమి పాడయిందను కోండ్రి...మరి పంటలెలా పండుతాయి? అందుకే ఈ పరిస్థితి వస్తుంది. మొదట్లో ఈ విషయాన్ని గుర్తించక కేవలం అధిక దిగుబడులన్న ఒకేఒక ధ్యేయంతో మందులవాడకాన్ని అధికం చేశారు. ఆ తర్వాత ఈ విషయాన్ని గుర్తించినా ఎరువులు బాగావాడందే పంటరాదన్న ఆలోచనల్లో కూరుకుపోయాడు రైతు. మొదట్లో రసాయనిక ఎరువులను వాడమని చెప్పినవాళ్లే తగ్గించమని చెప్పే పరిస్థితొచ్చింది. ఇంగ్లీషువాడు మొదట్లో ఉచితంగా టీ పోసి టీ కలవాటు చేసినట్టయింది వీటిసంగతి. ఇవో మోతాదులో వాడితేనే మంచిది. వీటి ఫలితాలు అనుభవంలో కొచ్చింతర్వాత గాని తెలిసిరాలేదు. ఇప్పుడు వద్దని ప్రచారం చేస్తున్నా దానివల్ల ఫలితాలు తక్కువే. సేంద్రియ ఎరువులను, పశువుల ఎరువులను వాడటం వల్ల భూసారం దెబ్బతినదు. భూమి బంగారుగుడ్డు పెట్టే బాతులాంటిది. దాన్ని కాపాడుకుంటే రోజుకోగుడ్డు పెడుతుంది. అన్నీ ఒకేసారి కావాలని అత్యాశకుపోయి దాన్ని కోస్తే జరిగేదేంటి? అలాగే భూమి విషయంలోనూ జరుగుతుంది. అంతేకాకుండా ఈ భూమి నాధారంగా చేసుకొని ఎన్నో తరాలు బతుకుతున్నాయి. ఇంకా బతకాలి కదా! భవిష్యత్తరాల కోసమైనా భూమిని కాపాడుకోవడం మన సామాజిక బాధ్యతగా గుర్తించాలి. అలాకాకుండా అంతా ఒకేసారి తోడుకుందామని చేస్తే భవిష్యత్తరాలకు మిగిలేదేమిటి?

తాను ప్రకృతికి విరుద్ధంగా ప్రవర్తిస్తే ఏం నష్టాలుంటాయని అనుకున్నాడో వాటినే విజ్ఞానాన్ని జోడించి కొడుకు చెప్పడం బాగానిపించింది ఓదెలుకు.

"మరి పురుగుల మందులని విపరీతంగా వాడుతున్నారు. వీటితోని రైతులు ఆత్మహత్యలు కూడ చేసుకోవట్టిరి. నా చిన్నతనంల ఇవ్వన్ని తెలువయి..."

(సశేషం)

## పాటల రంభ



రంభకు తెలుగులో కంటే తమిళంలోనే ఆశించిన రీతిలో అవకాశాలు వస్తున్నాయి. అయితే ఇటీవల చిరంజీవి సరసన 'ఇద్దరు మిత్రులు' చిత్రంలో ప్రత్యేక పాటలో నర్తించింది రంభ. బాలకృష్ణ సరసన 'భైరవ ద్వీపం' చిత్రంలో ప్రత్యేక పాటను చేసినప్పటి నుంచీ తనకు ఈ ఇమేజ్ వచ్చిందని, సెప్షల్ సాంగ్స్ చేసిన చిత్రాలు మంచి విజయం సాధించడం గమనించతగ్గ అంశమని తన ఆనందాన్ని వ్యక్తపరుస్తోంది రంభ.